సాక్షి
వనపర్తి
ఆదివారం । 28 । జనవరి । 2024



భక్తుల రద్దీ
అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.
వివరాలు 8లో ▸



.. కలసి పనిచేస్తాం
కేంద్రంలో ఇండియా కూటమితో కలిసి పనిచేస్తామని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.5 /17.2
రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కాస్త పెరుగుతుంది. అప్పుడప్పుడు చల్లటి గాలులు వీస్తాయి.

పథకం ప్రకారమే..!

దస్త్రాల మాయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల చేతివాటం

- భూ సేకరణ కార్యాలయంలో నిబంధనలకు పాతర
- ఇన్, అవుట్ వార్డ్ రిజిస్టర్లు సైతం..
- ఒరిజినల్స్‌కు బదులు జిరాక్స్ ప్రతులు
- రికార్డుల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడటమే కారణం



వనపర్తి: జిల్లా భూసేకరణ కార్యాలయంలో దస్త్రాల అదృశ్యం వ్యవహారంలో కొందరు సిబ్బంది పాత్ర ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు వనపర్తి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 19న కేసు నమోదు చేసినా.. ఇప్పటి వరకు విషయం ఏమిటని తేల్చలేదు. జిల్లాలోని పాత, కొత్త సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల తవ్వకాల కోసం చేపట్టిన భూ సేకరణకు సంబంధించిన దస్త్రాలు.. ముఖ్యంగా పరిహారం సరిపోలేదని, ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా వడ్డీతో కలిపి ఇవ్వాలని ప్రభుత్వాన్ని సవాల్ చేస్తూ కోర్టులో దాఖలు చేసిన కేసుల వ్యవహారంలోని ముఖ్యమైన దస్త్రాలు కనిపించడం లేదు. దాదాపు 20కి పైగా కేసులకు సంబంధించిన పత్రాలు లేవని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ పత్రాలు లేకుంటే సదరు రైతులకు కోర్టులో సానుకూల తీర్పు సాధ్యమవుతుందని తెలిసి మాయం చేసినట్లు తెలుస్తోంది.

కీలక పోస్టుల్లో..

వనపర్తి భూసేకరణ కార్యాలయంలో కీలక పోస్టుల్లో 15 ఏళ్లుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులే పనిచేయటం, ఎస్‌డీసీ స్థాయి అధికారులు కూడా ఎక్కువకాలం ఇన్‌చార్జ్‌లుగా కొనసాగడమే కీలకమైన పత్రాల మిస్సింగ్‌కు కారణమైనట్లు తెలుస్తోంది. ఏళ్లుగా పాతుకుపోయిన కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు బయటి వ్యక్తులతో కుమ్మక్కై అక్రమ మార్గాల్లో ప్రభుత్వం నుంచి ఒకటికంటే ఎక్కువ సార్లు పరిహారం పొందే మార్గాలు వెదికే వారికి సహకారం అందించేలా కార్యాలయంలోని దస్త్రాలను మాయం చేయటం, వారికి నిబంధనలకు విరుద్ధంగా దస్త్రాలు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలు ఇలా..

ప్రభుత్వం ఒకసారి భూమి సేకరించి పరిహారం డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసిన ఆరువారాల్లో పరిహారం సరిపోలేదని.. అదనంగా కావాలంటూ భూసేకరణ కార్యాలయంలో అండర్ ప్రొటెస్ట్ అప్లికేషన్ రైతులు సమర్పించాలి. అలాంటి రైతులు మాత్రమే మరోసారి కోర్టుకు వెళ్లి అదనపు పరిహారం కోసం పోట్లాడే హక్కు ఉంటుంది. కానీ ఇలాంటి అప్లికేషన్లు ఇవ్వని రైతుల పేరుతోనూ.. కోర్టులో కేసులు నమోదయ్యాయి. యూపీ అప్లికేషన్ ఇవ్వలేదనే ఆధారాలు చూపించే రికార్డులను కార్యాలయంలో లేకుండా చేయడం గమనార్హం. దీంతో కోర్టు సూచించిన మేరకు ప్రభుత్వం పరిహారం ఎన్నిరెట్లయినా చెల్లించాలి. ప్రభుత్వ ఖజానాకు భారీ ఎత్తున గండి కొట్టేందుకు చేసే కొందరి ప్రయత్నాలకు ఈ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సహకరించి దస్త్రాలను మాయం చేసి పరోక్షంగా ఆర్థిక లబ్ధి పొందుతున్నారనే అనుమానాలు అధికారుల్లో ఉన్నాయి.

కలెక్టర్ ఆదేశాలతో వెలుగులోకి..

కోర్టు అడిగిన దస్త్రాలు ఎందుకు సమర్పించలేకపోతున్నామని.. భూ సేకరణ కార్యాలయంలో మొత్తం ఫైల్స్‌ను పరిశీలించి నివేదిక ఇవ్వాలని మూడునెలల కిందట కలెక్టర్ నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటుచేసి అంతర్గత విచారణకు ఆదేశించారు. దీంతో దస్త్రాల మిస్సింగ్, ఇన్, అవుట్‌వార్డు రిజిస్టర్లు, యూపీ ఇయర్ వైజ్ రిజిస్టర్లు కనిపించటం లేదనే విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో కలెక్టర్ స్పందించి ఫైల్స్ మిస్సింగ్‌పై ఫిర్యాదు చేయించారు.

కోర్టులో సమయం తీసుకున్నాం..



కార్యాలయంలో కనిపించని దస్త్రాల విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. బాధ్యులు ఎవరనే విషయం తేల్చాల్సి ఉంది. కోర్టుకు సమర్పించాల్సిన రికార్డుల విషయంలో సమయం తీసుకున్నాం. వందశాతం కంటే ఎక్కువ పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశిస్తే.. ఉన్నత కోర్టును ఆశ్రయిస్తాం. ఇప్పటికే కొన్ని కేసుల విషయమై సుప్రీంకోర్టును ఆశ్రయించాం.

– వెంకటేశ్వర్లు, ఎస్‌డీసీ, వనపర్తి

రహదారి ప్రమాదాలు నివారిద్దాం



ఉత్తమసేవ పతకాలు అందుకున్న పోలీసులతో ఎస్పీ రక్షిత కె.మూర్తి

- ఎస్పీ రక్షిత కె.మూర్తి

వనపర్తి: రహదారి ప్రమాదాలను నివారించి ప్రాణాలు కాపాడుదామని ఎస్పీ రక్షిత కె.మూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ నేర సమీక్షలో ఆమె పాల్గొని మాట్లాడారు. డీజీపీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో జిల్లా ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరోను ప్రారంభించి అన్నిశాఖల అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిపై ఉన్న అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మొదట జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పెట్రోల్ బంకులు, దాబాల్లో పనిచేసే వారికి, యువత, గ్రామస్తులకు ఫస్ట్ ఎయిడ్, సీపీఆర్‌పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో 11 బ్లాక్ స్పాట్లను గుర్తించామని.. ప్రమాదాలను నివారించేందుకు పీఆర్, ఆర్అండ్‌బీ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పారదర్శకంగా కేసుల విచారణ..

పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల విచారణ పకడ్బందీగా పారదర్శకంగా చేపట్టాలని, అందుకుగాను క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌ను పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్వర పరిష్కారం కోసం కృషి చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం చేకూరేలా ప్రతి కేసు విచారణలో పక్కా ప్రణాళిక ఉండాలని.. ప్రతి వారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించాలన్నారు. బ్లూకోర్ట్, పెట్రోలింగ్ సిబ్బంది విధులు కచ్చితంగా నిర్వర్తించాలని, వర్టికల్ సిబ్బంది పనితీరును ఎస్ఐలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. నేరాల నియంత్రణ, ఛేదనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాందాసు తేజావత్, డీఎస్పీ ఆనంద్‌రెడ్డి, సీఐ రత్నం, ఎస్బీ సీఐ మధుసూదన్, ఎస్ఐ సంతోష్, ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పతకాలు అందజేత..

జిల్లా పోలీసుశాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పోలీసులకు రాష్ట్ర పోలీస్‌శాఖ ఉత్తమ సేవా పతకాలు ప్రకటించింది. శనివారం వారికి ఎస్పీ రక్షిత కె.మూర్తి పతకాలు అందజేశారు. ఏఎస్ఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ వరకు 20 మందికి సేవా పతకాలు అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వారికి పోలీసుశాఖ ఇచ్చే ఈ గుర్తింపు ఎంతో గౌరవాన్ని ఇస్తుందని ఎస్పీ కొనియాడారు.

మహిళా సాధికారతతోనే మెరుగైన సమాజం

- సీనియర్ సివిల్‌కోర్టు ప్రధాన నాయ్యమూర్తి వి.రజని



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి వి.రజని

పెబ్బేరు రూరల్: మహిళా సాధికారతతోనే మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటుందని సీనియర్ సివిల్‌కోర్టు ప్రధాన నాయ్యమూర్తి వి.రజని అన్నారు. జాతీయ కుటుంబ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వనపర్తి మండలం నాగవరం శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులు విద్యతో పాటు అన్నిరంగాల్లోనూ రాణించి స్ఫూర్తిగా నిలవాలని కోరారు. మహిళా హక్కుల సాధనకు ఎన్నో చట్టాలు ఉన్నాయని.. వాటిపై అవగాహన పెంచుకొని విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వరకట్నం, బాల్యవివాహాలు, గృహహింస, లోక్‌అదాలత్ తదితర వాటి గురించి వివరించారు. విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. సఖికేంద్రం లీగల్ కౌన్సిల్ డేగల కృష్ణయ్య మాట్లాడుతూ.. బాలికల అక్షరాస్యత శాతం పెరిగితే వారు ఉన్నత శిఖరాలకు చేరుకొనే అవకాశం ఉందన్నారు. మహిళల సమస్యల పరిష్కారానికి సఖికేంద్రాలు ఉపయోగపడుతాయని.. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.అరుణ, వైస్ ప్రిన్సిపాల్ జె.స్వప్న, అధ్యాపకులు బాలెం, ఇందిర, భారతి, హలీమా, లోక్‌అదాలత్ సిబ్బంది నాగరత్నమ్మ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరి ధాన్యం బస్తాల తరలింపు పరిశీలన



రైస్ మిల్లు ఆవరణలో అదనపు కలెక్టర్ తదితరులు

కొత్తకోట రూరల్: మండలంలోని ఇసాన్ ట్రేడర్స్ రైస్‌మిల్ నిర్వాహకులు సీఎంఆర్‌ను సకాలంలో ఇవ్వనందున కలెక్టర్ ఆదేశానుసారం పౌరసరఫరాలశాఖ అధికారులు మిల్లును సీజ్‌చేసి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. మిల్లులో ఉన్న 2.85 లక్షల వరి ధాన్యం బస్తాలను జిల్లాలోని ఇతర మిల్లులకు తరలించే పనులను అధికారులు వారం రోజులుగా చేపడుతున్నారు. ఇప్పటి వరకు 25 వేల బస్తాలను తరలించినట్లు అధికారులు వెల్లడించారు. తరలింపు ప్రక్రియను శనివారం అదనపు కలెక్టర్ తిరుపతిరావు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శ్రీనాథ్, తహసీల్దార్ బాల్‌రెడ్డి, డీటీ నంద కిషోర్ పరిశీలించారు.

బీఆర్ఎస్‌కు ఎదురుదెబ్బ!

- చేతికి చిక్కిన పాలమూరు 'మున్సిపల్' పీఠం
- మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై నెగ్గిన అవిశ్వాసం
- హాజరైన సభ్యులందరూ అవిశ్వాసానికి అనుకూలంగా ఓటు
- చైర్మన్ వర్గానికి చెందిన 14 మంది కౌన్సిలర్లు గైర్హాజరు
- కలెక్టర్ ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం



అవిశ్వాసం నెగ్గడంతో విజయ సంకేతం చూపిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పాలమూరులో బీఆర్ఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పురపాలిక పీఠం 'హస్త'గతమైంది. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, వైస్ చైర్మన్ తాటి గణేష్‌కుమార్ (బీఆర్ఎస్)లపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. దీంతో వారిద్దరూ తమ పదవులను కోల్పోయారు. శనివారం ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో కలెక్టర్ రవినాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ప్రారంభమైంది. అప్పటికే మొత్తం 49 మందికి గాను 35 మంది కౌన్సిలర్లు అక్కడికి చేరుకున్నారు. వీరిలో బీఆర్ఎస్‌కు చెందిన 22 మంది, కాంగ్రెస్‌కు చెందిన ఆరుగురు, ఎంఐఎం నుంచి నలుగురు, బీజేపీ నుంచి ముగ్గురు ఉన్నారు. మిగిలిన 14 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. కాగా, మధ్యాహ్నం 12 గంటలకు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టగా 35 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చేతులెత్తి మద్దతు పలికారు. అలాగే 12.45 గంటలకు వైస్ చైర్మన్ పైనా మరో తీర్మానం ప్రవేశపెట్టగా అందరూ చేతులెత్తారు. అనంతరం వీరిద్దరూ పదవిని కోల్పోయినట్లు కలెక్టర్ ప్రకటించారు. త్వరలో కొత్త చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉండగా.. ఆనంద్‌గౌడ్‌కే ఆ పదవీ దక్కే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతోంది.

భారీ బందోబస్తు మధ్య..

క్లాకటవర్ సమీపంలోని మున్సిపల్ కార్యాలయం మొత్తం పరిసరాలను పోలీసులు శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు భారీగా మోహరించారు. గత నెలలో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో మహబూబ్‌నగర్ పట్టణంలో రాజకీయ సమీకరణాలు మారాయి. అప్పటి నుంచే ఎలాగైనా చైర్మన్, వైస్‌చైర్మన్లను పదవి నుంచి దించేయాలని మెజారిటీ కౌన్సిలర్లు నిర్ణయించుకున్నారు. వీరికి కాంగ్రెస్ నేతల నుంచి అన్ని రకాల సహకారం లభించింది. ఈ క్రమంలోనే కౌన్సిల్ ఉన్న మొత్తం 49 మంది సభ్యులు రెండు గ్రూపులుగా విడిపోయారు. ఈనెల 6న ఏకంగా 32 మంది కలెక్టర్‌ను కలిసి అవిశ్వాస తీర్మానానికి నోటీసు అందజేశారు. ఆ తర్వాత విహారయాత్రల పేరిట క్యాంపునకు తరలిపోయారు. శనివారం ఉదయం ఆనంద్‌గౌడ్ వర్గానికి చెందిన కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో స్థానిక మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు.కాగా చైర్మన్‌కు చెందిన 14 మంది హాజరుకాకపోవడంతో అవిశ్వాస తీర్మానం సజావుగా ముగిసింది.

మోక్షమెప్పుడో..?

మరుగునపడిన లెదర్ పార్కుల ఏర్పాటు

- పోలేపల్లి, జినుకుంటలో 50 ఎకరాల భూముల కేటాయింపు
- నిరుపయోగంగా మారిన యంత్ర సామగ్రి
- వినియోగంలోకి తెస్తే లక్ష మందికి ఉపాధి అవకాశాలు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా దృష్టిసారించాలని వేడుకోలు



బల్మూర్ మండలం జిన్‌కుంట వద్ద నిరుపయోగంగా ఉన్న మినీ లెదర్‌పార్క్ భవనం

జడ్చర్ల: చర్మ ఉత్పత్తుల పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (లిడ్‌క్యాప్) ఏర్పాటు చేసే లెదర్ పార్కులు మోక్షం కోసం ఎదురుచూస్తున్నాయి. దాదాపు లక్ష మందికి ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం లెదర్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో 50 ఎకరాల భూమిని లిడ్‌క్యాప్‌కు అప్పగించింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్ సమీపంలో 25 ఎకరాల అసైన్డ్ భూమి, నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం జినుకుంటలో 25 ఎకరాల భూమిని 2002లో కేటాయించారు. ఇందులో భాగంగానే 2004లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చర్మకారుల అభివృద్ధి కోసం జినుకుంటతో పాటు పోలేపల్లి శివారులో ప్రత్యేకంగా రూ.35 లక్షలు వెచ్చించి (మలుపు) భవనాలు సైతం నిర్మించారు. దాదాపు రూ.2 కోట్ల వ్యయంతో చర్మ ఉత్పత్తులకు సంబంధించిన యంత్ర సామగ్రిని సమకూర్చారు. తర్వాత వాటి గురించి పట్టించుకోకపోవడంతో పథకం ఉద్దేశం నెరవేరలేదు.

పలువురికి శిక్షణ

చర్మ ఉత్పత్తుల తయారీకి సంబంధించి అప్పట్లో పలువురు నిరుద్యోగ దళిత యువకులను గుర్తించి వారికి తమిళనాడు రాష్ట్రం చెన్నైలో శిక్షణ ఇప్పించారు. వారి ద్వారా జడ్చర్ల ఇండస్ట్రియల్ పార్కులో దాదాపు 250 మందికి చర్మ ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కాలంలో నెలకు రూ.1,500 చొప్పున స్టైఫండ్ సైతం చెల్లించి శిక్షణ ధ్రువపత్రాలను అందించారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ద్వార ఒక్కో అభ్యర్థికి రూ.7,500 రుణ సౌకర్యం కల్పించారు. లెదర్ పార్కులలో ఏర్పాటయ్యే పలు పరిశ్రమలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇదే క్రమంలో జినుకుంటలోనూ దాదాపు 400 మందికి శిక్షణ ఇచ్చినా ఫలితం లేకపోయింది.

శిథిలావస్థకు చేరిన భవనాలు

పోలేపల్లి, జిన్‌కుంటలో చర్మకారుల వృత్తికి సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన మలుపు భవనం కూడా క్రమేపీ శిథిలావస్థకు చేరుకుంది. భవనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో కిటికీలు, తలుపులు, షట్టర్ తదితర సామగ్రిని దొంగలు అపహరించుకెళ్లారు.యంత్రాలు పూర్తిగా తుప్పుపట్టిపోయాయి.

ఏపీఐఐసీకి అప్పగింత

లెదర్ పార్కు ఏర్పాటు చేసేందుకు లిడ్‌క్యాప్ 2008లో రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ)కి అప్పగించింది. అయితే ఏపీఐఐసీ అధికారులు దీనికి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో 2013లో ప్రభుత్వం ఏపీఐఐసీ నుంచి సదరు భూమిని వెనక్కి తీసుకుని మళ్లీ లిడ్‌క్యాప్‌కి బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే భూమిని స్వాధీనం చేసుకున్న లిడ్‌క్యాప్ ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. ఉమ్మడి జిల్లాలోని దళితులకు ఉపయోగపడే విధంగా లెదర్ పార్కులు అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

➩ బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది లిడ్‌క్యాప్ శిక్షణ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించేందుకు రూ.60 లక్షలు కేటాయించింది. తమిళనాడులోని సీఎల్ఆర్ఐ (సెంట్రల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్)కు సంబంధించి ఈ నిధులు కేటాయించినట్లు సంబంధిత అధికారులు అప్పట్లో చెప్పినా ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది.



వృథాగా ఉన్న యంత్రాలు



భూముల ధరలకు రెక్కలు

జడ్చర్ల మండలంలోని పోలేపల్లి శివారులో లెదర్ పార్కుకు కేటాయించిన భూముల విలువ ప్రస్తుతం రూ.కోట్లలో పలుకుతుంది. ఒకవైపు సెజ్.. మరో వైపు జాతీయ రహదారిని అనుసరించి ఉండడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇక్కడ బహిరంగ మార్కెట్‌లో ఒక్కో ఎకరం ధర రూ.3 కోట్లకు పైగా పలుకుతుంది. ఇంతటి విలువైన భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

ఉపాధి కల్పించాలి..

ఎన్నోసార్లు లిడ్‌క్యాప్ సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా పట్టించుకుని తమకు ఉపాధి కల్పించాలి. ఈ విషయాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు మావంతుగా కృషిచేస్తాం.

– కృష్ణయ్య, చర్మకారుల సంఘం అధ్యక్షుడు, జడ్చర్ల

న్యూస్‌రీల్

వేతనాల మంజూరుకు వినతి




వనపర్తిటౌన్: జిల్లా విద్యాధికారి కార్యాలయ సిబ్బంది, ఎయిడెడ్ ఉపాధ్యాయులు, బాలభవన్ ఉద్యోగులు, సిబ్బంది వేతనాలు ఇప్పించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ యాదయ్యకు పట్టణానికి చెందిన ఉపాధ్యాయులు శనివారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలో విధులు నిర్వర్తించే ఏడీ సెలవులో వెళ్లడంతో ఈ నెల వేతనాలు చేసేందుకు సంబంధిత దస్త్రాలు ముందుకు కదలడం లేదని, దీంతో వేతనాలు ఆగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం చొరవచూపి జనవరి వేతనాలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు యాదయ్య సానుకూలంగా స్పందించినట్లు ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, సంఘం ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

విజ్ఞాన సమాజంతోనే ఉత్తమ ఫలితాలు



ఖిల్లాఘనపురం: శాస్త్రవేత్తల మేధోమథనంతోనే విజ్ఞానవంతమైన సమాజం పురోగమిస్తుందని.. తద్వారా సమాజంలో మంచి మార్పులు సాధ్యమవుతాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నరేందర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి పోటీల కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలు ఎన్నో త్యాగాలు చేసి సృష్టిలోని రహస్యాలను శోధించారని.. అదే స్ఫూర్తితో విద్యార్థులు ముందడుగు వేయాలన్నారు. పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తెలుగు మీడియంలో అప్పారెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు శివ, గాయత్రి, నరేష్ బృందం, ఇంగ్లీష్ మీడియంలో మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు భవ్యశ్రీ, రష్మిక, గౌతమి బృందం ప్రథమ స్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఆయా విద్యార్థులు త్వరలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బీజేపీ ఓటమే లక్ష్యం'



ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటమే లక్ష్యంగా సమష్టిగా ముందుకెళ్లాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వర్తకసంఘం భవనంలో జరిగిన పార్టీ జిల్లా స్థాయి సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు శ్రీహరి, గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 50 మంది ఆయన సమక్షంలో సీపీఐలో చేరగా.. కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతోన్మాదంతో దేశ ప్రజలను విభజించి పాలిస్తున్న బీజేపీ అరాచకాలు అధికమయ్యాయని, దేశ వ్యాప్తంగా ప్రజల్లో అసహనం పెరిగిపోతుందని తెలిపారు. సంక్షేమాన్ని గాలికొదిలి రాముడి పేరిట రాజకీయం చేస్తూ అరాచకాలు సృష్టిస్తున్న బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు బాలనర్సింహ, ఆనంద్‌జీ, జిల్లా కార్యదర్శి విజయరాములు, నాయకులు సీఎస్ శెట్టి, రాబర్ట్, మోషా, సురేష్, అబ్రహం పాల్గొన్నారు.

నేడు స్వకులసాలి రాష్ట్రసదస్సు

ఆత్మకూర్: స్వకులసాలి రాష్ట్రసమాజ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం పట్టణంలోని వర్తకసంఘం భవనంలో నిర్వహిస్తున్నామని సంఘం నాయకులు శ్రీనివాసులు, జిందె గోపి, జిందె మురళి శనివారం తెలిపారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు రామలింగేశ్వర్ కాంబ్లే, రాష్ట్ర ప్రధానకార్యదర్శి అశోక్‌కుమార్, రాష్ట్ర కోశాధికారి విఠల్‌రావు సూపే తదితరులు హాజరవుతారని.. స్వకులసాలి సమాజ్ కుల బాంధవులు పెద్దఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

గండేడ్: పొలంలో విద్యుత్ వైరు తగిలి అక్కడికక్కడే రైతు మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బల్సూర్‌గొండకు చెందిన గొల్ల భగవంత్ (58) వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదే తరుణంలో శనివారం ఉదయం పొలానికి వెళ్లగా ప్రమాదవశాత్తు పొలంలో ఉన్న విద్యుత్ వైరు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

యువకుడి బలవన్మరణం

అచ్చంపేట రూరల్: పురుగు మందు తాగి ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆంజనేయతండాకు చెందిన వాసునాయక్(24) పట్టణంలోని బంధువుల ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం తెల్లవారుజామున పురుగు మందు తాగాడు. గుర్తించిన బంధువులు వెంటనే అచ్చంపేటలోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. సొంత గ్రామమైన ఆంజనేయతండాకు యువకుడి మృతదేహాన్ని తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు.

ఆర్టీసీ బస్సులో మహిళ మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఆర్టీసీ బస్సులో మహిళ గుండెపోటుతో మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. బల్మూరు మండలం జినుకుంటకు చెందిన బంగారమ్మ (38) స్వగ్రామం వెళ్లేందుకు అచ్చంపేట బస్సును జిల్లా కేంద్రంలో ఎక్కి వెళ్తుండగా, డిపో సమీపంలో ఆమెకు గుండెపోటు రావడంతో డ్రైవర్ వెంటనే బస్సును జనరల్ ఆస్పత్రి వద్దకు తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

పోలీసుల అదుపులో పాత నేరస్తుడు

మహబూబ్‌నగర్ క్రైం: రైల్వే పోలీసులు శనివారం జిల్లాకేంద్రంలోని స్టేషన్ ఆవరణలో సాధారణంగా చేస్తున్న తనిఖీల్లో ఓ పాత నేరస్తుడు పట్టుబడ్డాడు. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం..స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న క్రమంలో విశాఖపట్నం జిల్లా గాజువాక ప్రాంతానికి చెందిన గణేష్ అనుమానస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. వేలిముద్రలు పరిశీలించగా అతడిపై 28 దొంగతనం కేసులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నారు. సదరు వ్యక్తిని మహబూబ్‌నగర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి అనంతరం గాజువాక పోలీసులకు అప్పగించినట్లు వివరించారు.

ఆలూరులో గుడిసె దగ్ధం

గట్టు: మండలంలోని ఆలూరులో శుక్రవారం అర్ధరాత్రి గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎర్ర నాగమ్మ వ్యవసాయ పొలం వద్దే గుడిసె వేసుకుంది. అయితే అర్ధరాత్రి ఎవరూ లేని సమయంలో గుడిసెకు నిప్పంటుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక వాహనం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. గుడిసెకు ఉద్దేశ పూర్వకంగానే నిప్పు పెట్టినట్లుగా అనుమానం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో రూ.45వేల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

మోటార్ల కేబుల్ చోరీ

కేటీదొడ్డి: మండలంలో వ్యవసాయ మోటార్ల కేబుల్ చోరీ కలకలం సృష్టిస్తోంది. వారం రోజుల వ్యవధిలోనే రెండుసార్లు కేబుల్‌ను చోరీ చేయడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఉమిత్యాల, ఉమిత్యాలతండా, కొండాపురం రైతులు ర్యాలంపాడు ప్రధాన కాల్వ వెంట మోటార్లు అమర్చుకున్నారు. శుక్రవారం రాత్రి నారాయణపేట జిల్లాకు చెందిన చిట్యాల వాసి తెలుగు నాగేష్ 200 మీటర్ల వైరు చోరీ చేస్తుండగా రైతులు పట్టుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సత్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.



లారీ ఎక్కిన రైలింజన్

ఉండవెల్లి: మండలంలోని అలంపూర్ చౌరస్తా జాతీయ రహదారిపై లారీపై రైలు ఇంజన్‌ను ఎక్కించారు. శనివారం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు 74 టైర్లు కలిగిన ట్రక్‌పై రైలింజన్‌ను రోడ్డుపై తరలిస్తుండడంతో డ్రైవర్ సేద తీరడానికి ఆపడంతో ప్రజలు ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

రేవంత్ పాలన దేశానికి దిక్సూచి

- సమష్టి కృషితో రాహుల్‌ను ప్రధాని చేద్దాం
- చల్లా వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: సీఎంగా బాధ్యతలు చేపట్టిన పాలమూరు ముద్దుబిడ్డ రేవంత్‌రెడ్డి పాలన దేశంలోనే దిక్సూచిగా మారిందని, ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలను ఎలా గెలిపించామో, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ స్థానాన్ని భారీ మెజార్టీతో గెలిపించి ఢిల్లీలో ఖ్యాతిని నిలపాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు. భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజలను మమేకం చేసిన రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఇటీవల అనిరుధ్‌రెడ్డి కార్యకర్తలకు ఇస్తున్న భరోసా రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమైందన్నారు. అభివృద్ధికి సంబంధించి త్వరలోనే అనిరుధ్‌రెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డికి వివరిస్తామన్నారు. ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ జోడో యాత్ర సాగిన తన నియోజకవర్గంతో పాటు జడ్చర్ల, దేవరకద్ర, మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారని తెలిపారు. ఎంపీగా వంశీచందర్‌ను గెలిపించి రాహుల్‌గాంధీకి బహుమతి ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న వంశీచంద్‌రెడ్డి కేంద్రంలో తన సేవలు అవసరం అవుతాయని భావించి తన కోసం కల్వకుర్తి సీటును త్యాగం చేసిన గొప్పవ్యక్తి అన్నారు. ఆయన కల్వకుర్తి నుంచి గెలిస్తే నేడు మంత్రి అయ్యేవారని అంత అవకాశం ఉన్నా తాను రాహుల్‌గాంధీకి దగ్గరగా ఉంటూ ప్రజలకు సేవలు అందించేందుకు అసెంబ్లీకి పోటీ చేయలేకపోయారని తెలిపారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిపై బీజేపీ నాయకురాలు డీకే అరుణ ఆరోపణలు చేయడం తగదన్నారు. డీకే అరుణ సవాల్‌ను స్వీకరించిన వంశీచందర్‌రెడ్డి దేవుడిపై ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లి ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు కార్యకర్తలు మరింత కృషి చేయాలన్నారు.

అవినీతి, అక్రమాలను కక్కిస్తాం: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నియోజకవర్గంలో దశాబ్ద కాలంగా విచ్చలవిడిగా సాగిన అవినీతి, అక్రమాలను కక్కిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. భూకబ్జాలు, ఇసుక మాఫియా ఆట కట్టిస్తామన్నారు. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణాపై చర్యలు చేపట్టామని, త్వరలోనే చౌకగా ఇసుకు సరఫరా చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. లాక్కున్నారని , చెరువులలో నల్లమట్టిని కొల్లగొట్టి కోట్లు గడించారని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమావేశానికి ముగింపు సమయంలో ఆలస్యంగా వచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిత్యానందం, వసంత పాల్గొన్నారు.

వన్యప్రాణులకు మరింత భద్రత



మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: పులుల అభయారణ్యం కేంద్ర అటవీ శాఖ పర్యావరణ సున్నిత ప్రాంతం (ఎకో సెన్సిటివ్ జోన్)చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో కమిటీ అనుమతి లేకుండా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరాదని, పులులు, వన్యప్రాణుల మనుగడకు ఎకో – సెన్సిటివ్ జోన్ కమిటీ ద్వారా మరింత భద్రత చేకూరుతుందని కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన ఎకో సెన్సిటివ్ జోన్ నిపుణుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్రాబాద్ పులుల అభయారణ్యం చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న కమిటీ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కమిటీలోని లైన్ డిపార్ట్‌మెంట్లు అటవీ శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, రోడ్లు భవనాలు, నీటి పారుదల, భూ ఖనిజాలు, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా ఉంటారు. లైన్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి జాతీయ పులుల అభయారణ్యం సున్నిత ప్రాంతాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అమ్రాబాద్, పదరలోని అన్ని గ్రామాలు, అచ్చంపేట, బల్మూర్, ఉప్పునుంతల, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, పెంట్లవెల్లి, లింగాల పరిధిలో కొన్ని గ్రామాల చొప్పున ఎకో సెన్సిటివ్ ప్రాంతంలో వస్తాయని తెలిపారు. ఈ ప్రాంతంలో వ్యవసాయం, చేపల పంట వేసుకోవచ్చు అన్నారు. ఎట్టి పరిస్థితిలో బ్లాస్టింగ్ చేయడానికి వీలు లేదన్నారు. రోడ్ల విస్తరణ, విద్యుత్ లైన్, పారిశ్రామిక కార్యక్రమాలు చేపట్టడానికి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రంగాపూర్ పరిధిలో 2, కొల్లాపూర్ పరిధిలో ఒకటి చొప్పున ఖనిజ కంపెనీలు ఉన్న విషయాన్ని మైనింగ్ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ కమిటీ ఆమోదం తప్పనిసరి అని ఆమోదం లేని పక్షంలో కమిటీ ద్వారా ఆమోదం తీసుకోవాలని లేకుంటే నిలిపివేసేవిధంగా ఆదేశాలు ఇవ్వాలని అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుమార్ దీపక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామరావు, డీఎఫ్‌ఓ రోహిత్ గోపిడి, డీపీఓ కృష్ణ, వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్వర్లు, నీటి పారుదల శాఖ అధికారి మురళీ పాల్గొన్నారు.

నిలువురాళ్ల చరిత్ర చాలా గొప్పది



నిలువురాళ్లపై విద్యార్థులకు వివరిస్తున్న ఆర్కియాలజిస్ట్ ప్రొ. కేపీరావు

మాగనూర్: ప్రపంచంలోనే గొప్ప చరిత్ర కలిగిన నిలువురాళ్ల ప్రదేశమని ఆర్కియాలజిస్టిక్ కేపీరావు అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిలువురాళ్లపై 10 ఏళ్లుగా పరిశోధనలు చేస్తూ దానికి సంబంధించిన డాక్యుమెంటేషన్ వివరించారు. నిలువురాళ్లు 3వేల ఏళ్ల క్రితం నాడే ఇక్కడ ఏర్పాటు చేశారని తెలిపారు. దానికి సంబంధించి నక్షత్ర మండలాల యొక్క సూర్యగమన అధ్యాయానికి ఇది పనిచేస్తుందని తెలిపారు. ఇక్కడ ఒక రాయిపైన ఉండేటటువంటి సప్త రుషి మండలం ఆకాశంలో ఉండే సప్త రుషి మండలానికి సరిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సింహులు, నరేందర్, సీఆర్పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐ జక్కుల హన్మంతుపై సస్పెన్షన్ వేటు



జక్కుల హన్మంతు , సీఐ

నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ హత్యకు సంబంధించి నిందితుడు రామాటి సత్యనారాయణకు సహకరించాడని గతంలో నాగర్‌కర్నూల్ సీఐగా పనిచేసిన జక్కుల హన్మంతు శనివారం సస్పెండ్ చేస్తూ మల్టీజోన్ –2 ఐజీ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రకటనలో తెలిపారు. జక్కుల హన్మంతు ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా కంగ్టి సీఐగా విధులు నిర్వహిస్తున్నాడని, హత్య కేసులో నిందితుడికి సహకరించినట్లు విచారణలో వెల్లడైందని ఎస్పీ తెలిపారు. 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలతో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు.

సెమీ ఫైనల్‌కు చేరిన గ్రీన్‌సిటీ ఎలెవన్, జీటీఆర్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న సీవీకే ఆల్ ఇండియా లెవల్ టీ–20 క్రికెట్ టోర్నీ తుది ఘట్టానికి చేరుతుంది. ఆరవ రోజు శనివారం మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. గ్రూప్ బీ నుంచి ఉదయం సెషన్‌లో గట్టు తిమ్మారెడ్డి వర్సెస్ మస్కటి ఎలెవన్ జట్లు తలపడ్డాయి. 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. బరిలోకి దిగిన మస్కటి ఎలెవన్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 176 పరుగులు మాత్రమే చేసింది. 33 పరుగుల తేడాతో జీటీఆర్ గెలిచింది. గ్రూప్ ఏ నుంచి మధ్యాహ్నం సెషన్‌లో రేవంత్ రైజర్స్ వర్సెస్ గ్రీన్‌సిటీ ఎలెవన్ జట్లు తలపడ్డాయి. రేవంత్‌రైజర్స్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 172 పరుగులు చేసింది. గ్రీన్‌సిటీ 17ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసి విజయం అందుకుంది.

'హనుమాన్' సినిమాలో పెద్దకొత్తపల్లి బాలుడు



హీరో తేజతో వికాస్

పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్లకు చెందిన వికాస్ కొత్తగా వచ్చిన హనుమాన్ సినిమాలో బాల నటుడిగా నటించారు. గతంలో ఈయన స్వయంభూ, టక్ జగదీష్, విరూపాక్ష తదితర సినిమాల్లో నటించాడు. ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్నాడు. హనుమాన్ సినిమా విజయవంతం కావడంతో బాలుడిని తండ్రి కృష్ణయ్య గౌడ్, తల్లి రాణి, గ్రామస్తులు అభినందించారు.

దాసరి కొండప్పకు ఘన సన్మానం



దాసరి కొండప్పను సన్మానిస్తున్న జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మిథున్‌రెడ్డి తదితరులు

పాలమూరు: అంతరించిపోతున్న కళను గుర్తించి ఉమ్మడి పాలమూరు జిల్లావాసికి పద్మశ్రీ అవార్డు రావడం ఈ జిల్లా ప్రజల అదృష్టమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి అన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పను శనివారం జిల్లా కేంద్రంలోని జితేందర్‌రెడ్డి నివాసంలో ఘనంగా సన్మానించారు. ఆయనకు రూ.25వేల నగదును అందించారు. కార్యక్రమంలో ఏపీ మిథున్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఫిబ్రవరి 27, 28న పీయూలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో 'కెమిస్ట్రీ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్' అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. సంబంధిత బ్రోచర్‌ను వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ మనుగడలో కెమిస్ట్రీ ప్రాధాన్యత, ప్రస్తుతం అందులో వస్తున్న నూతన ఆవిష్కరణలనే అంశంపై నిపుణులతో ప్రసంగం ఉంటుందన్నారు. ఈమేరకు కార్యక్రమానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, వీరసురేంద్రసాయి, పలువురు అధ్యాపకులు, రీసెర్చ్ స్కాలర్స్ పాల్గొంటారని తెలిపారు. ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, శ్రీధర్, ప్రవీణ, అర్జున్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ

జోగుళాంబ శక్తిపీఠం: శ్రీశైలానికి పశ్చిమద్వార క్షేత్రంగాను, అష్టాదశ శక్తిపీఠమైన అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలను శనివారం భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి బాలబ్రహ్మేశ్వరుడికి అభిషేకాలు చేసి శివ దీక్షను స్వీకరించారు. సాధారణ భక్తులకు, శివ దీక్ష తీసుకున్న వారికి ఆలయ నిత్యాన్నదాన సత్రం ద్వారా వేర్వేరు చోట్ల పెద్దఎత్తున అన్నదానాలు చేశారు. శివదీక్ష స్వీకరించిన భక్తులకు ప్రతిరోజు ఆలయంలో అన్నదానం ఉంటుందని, ఒక్క ఏకదశి రోజు మాత్రం ఉండదని సత్రం ఇన్‌చార్జి ప్రదీప్ తెలిపారు.

ఇండియా కూటమితో కలిసి పనిచేస్తాం

- ఓట్ల కోసం బీజేపీ రాముడితో మత రాజకీయం
- సీపీఐకి ఒక ఎంపీ సీటును ఆశిస్తున్నాం
- సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఆత్మకూర్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందని, 75 ఏళ్లుగా కొనసాగుతున్న రాజ్యాంగ విలువలను కాలరాస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వర్తక సంఘం భవనంలో సీపీఐ జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అరాచకాలు అధికమయ్యాయని, దేశవ్యాప్తంగా ప్రజల్లో అసహనం ఉప్పెనలా ఎగిసిపడుతుందని తెలిపారు. ధరల పెరుగుదల, వ్యవసాయ నల్లచట్టాలు, దేశ సంపద బడాబాబుల పాలవుతుందని, ఆపాపాలను కడుక్కునేందుకే బాలరాముడిని ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. బీజేపీ ఓటమే లక్ష్యంగా ఇండియా కూటమితో కలిసి పనిచేస్తామని, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమకు సీట్లు కేటాయించకపోయినా బీఆర్ఎస్, బీజేపీ ఓటమే లక్ష్యంగా పనిచేసి సఫలీకృతం అయ్యామన్నారు. కేంద్ర వైఫల్యాలపై ప్రశ్నించేవారిని దేశద్రోహం, రాజద్రోహం, ఈడీ కేసులు పెడుతూ భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

ఒక ఎంపీ సీటు అడిగాం..

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో ఖమ్మం, నల్లగొండ, భువనగిరి, వరంగల్, పెద్దపల్లిలో ఏదో ఒకటి ఎంపీ సీటును ఇవ్వాలని కోరుతున్నామని త్వరలోనే ఈవిషయంపై స్పష్టత రానుందని వెల్లడించారు. 12 ఎంపీ సీట్లు గెలుస్తామని గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీకి ఓటు అడిగే హక్కు ఉందా? అని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం అడుగడుగున అన్యాయం చేసిందన్నారు. సమావేశంలో బాలనర్సింహ, ఆనంద్, విజయరాములు, సీఎస్ శెట్టి, రాబర్టు, మోష, సురేష్ తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయిలో విజేతలుగా నిలవాలి



రాష్ట్ర క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి గో పోటీల్లో మెరుగ్గా ఆడి విజేతలుగా నిలవాలని గో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సీనియర్ ఉపాధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్ అన్నారు. బీహార్ రాష్ట్రం ఆరా పట్టణంలో ఆదివారం నుంచి ఈనెల 30 వరకు మొదటి సీనియర్ నేషనల్ గో చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర క్రీడాకారులు శుక్రవారం బయలుదేరారు. స్థానిక మెయిన్‌స్టేడియంలో క్రీడాకారులను అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకాగ్రతతో ఆడితే గో క్రీడలో విజయం సాధించవచ్చని తెలిపారు. ప్రధాన కార్యదర్శి గులాం అఫ్రోజ్, అర్జున్ పాల్గొన్నారు.

రాష్ట్ర పురుషుల జట్టు

నుమైర్ (హైదరాబాద్), ఎస్.నవీన్ చౌహాన్, మహ్మద్ అయాన్, మహ్మద్ ఉస్మాన్ (మహబూబ్‌నగర్), అర్షద్ (రంగారెడ్డి).

మహిళలు..

షబానా (రంగారెడ్డి), సుమయ (నాగర్‌కర్నూల్), ఆసియా (మహబూబ్‌నగర్), ముఫ్లిహ (హైదరాబాద్).

అయోధ్యకు బైక్‌పై ప్రయాణం



బయలుదేరుతున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆనంద్‌తో కాలనీవాసులు

గద్వాల అర్బన్: అయోధ్యలో బాల రాముడిని ప్రతిష్ట సందర్భంగా రాములోరిని దర్శించుకునేందుకు ఇద్దరు భక్తులు గద్వాల నుంచి అయోధ్యకు బైక్‌పై బయలుదేరారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆనంద్, మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన నాగరాజులు ముందుగా రాఘవేంద్ర కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆనంద్‌కు ఆయన తల్లిదండ్రులతో పాటు కాలనీవాసులు ఆశీర్వాదించి యాత్ర విజయవంతంగా ముగించుకోని రావాలని ఆకాంక్షించారు. దేశంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ బైక్‌పై అయోధ్యకు బయలుదేరుతున్నట్లు ఆనంద్ తెలిపారు.

ప్రజలకిచ్చిన హామీలు నెరవేరుస్తాం

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ



ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనరసింహ

ఎర్రవల్లి చౌరస్తా/జోగుళాంబ శక్తిపీఠం /ఉండవెల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి, ఉమ్మడి మహబూబ్‌నగర్‌జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం జోగుళాంబ గద్వాల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా ప్రజలు నిర్బంధంలో ఉన్నారన్నారు. గత ప్రభుత్వంలో దోపిడీ, అరాచకాలు తప్పా ప్రజల జీవితాలు ఏ మాత్రం మారలేదన్నారు. సోనియాగాంధీ రాష్ట్ర ప్రజలకు మాట ఇచ్చి ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకుందన్నారు. పదేళ్ల పాలనలో నాలుగుసార్లు పేపర్ లీకేజీలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఒక్క కుటుంబానికి కూడా రేషన్‌కార్డు ఇచ్చిన చరిత్ర బీఆర్ఎస్‌కు లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్‌కార్డులు, భూములు ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్‌కే చెందిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మినందుకే అధికారం ఇచ్చి పట్టం కట్టారన్నారు. పది రోజుల్లో మరో రెండు పథకాలు అమలవుతాయని తెలిపారు. జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలు ఓడిపోయినా ప్రజలు నిరాశ చెందవద్దని, వచ్చే ఎంపీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపీ స్థానాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా జూరాల కుడి కాల్వకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో చర్చించి రైతుల సాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ సంతోష్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, అడిషనల్ కలెక్టర్లు అపూర్వచౌహాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

జోగుళాంబ తల్లి ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా అన్ని గ్యారంటీలను అమలు చేస్తామని వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. శనివారం ఆయన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీ మంత్రి చిన్నారెడ్డితో కలిసి అలంపూర్ జోగుళాంబ ఆలయాన్ని దర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంతోష్ పుష్పగుచ్ఛం అందజేయగా, ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య అధ్వర్యంలో అర్చకులు వేదమంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. రాబోయే ఐదేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఆ క్రమంలోనే అమ్మవారిని దర్శించి పలు ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం..

అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిని అందుబాటులోకి త్వరలో తీసుకొస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలంపూర్ పర్యటనలో భాగంగా ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిని మంత్రి పరిశీలించారు. ఉంది, త్వరలో అన్ని విభాగాల్లో సిబ్బందిని ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంతోష్‌కు మంత్రి ఆదేశించారు.